ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట



## అక్టోబర్ 25 నుంచి హామ్ రోడ్ల పనులు ప్రారంభం




మొయిన్‌లో

# 'కెయు' అభివృద్ధికి త్వరగా నిధులు

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి కావ్య వినతి

### ఎంపి డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎంఉషా నిధుల మంజూరు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్, సిఐటిడి కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపి వివరించారు. కాకతీయ యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు పీఎంఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు.



**పురావస్తు మ్యూజియానికి రూ.10 కోట్లు:** వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రిని ఎంపీ కోరారు. 1991లో ఏర్పాటు చేసిన ప్రస్తుత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త మ్యూజియం భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన వసతులు, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026–31కు సంబంధించిన సవరించిన మ్యూజియం గ్రాంట్ పథకం మార్గదర్శకాలు వెలువడిన అనంతరం ప్రతిపాదన సమర్పించాల్సి ఉన్నందున, ఆ మేరకు కేంద్రంతో సమన్వయం చేయాలని కోరారు. వరంగల్‌లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. వరంగల్‌లో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సిఐటిడి) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

**పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి**

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పిఓపిఎస్ కే) స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పిఎస్ కే) ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. 2017 మార్చి 29న ఏర్పాటు చేసిన పిఓపిఎస్ కే ద్వారా ప్రాంత ప్రజలకు సేవలు అందుతున్నాయని, పాస్‌పోర్ట్ సేవలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వరంగల్‌హనుమకొండకాజీపేట త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా తగిన మౌలిక వసతులు, సిబ్బందితో పూర్తిస్థాయి పిఎస్ కే ఏర్పాటు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని ముఖ్యమంత్రిని ఎంపి కోరారు. వరంగల్ ప్రాంత వారసత్వాన్ని పరిరక్షించే చర్యలకు కేంద్ర సహకారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున చొరవ చూపాలని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. అలాగే వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్యతో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్‌ని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత శాఖలతో చర్చించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వెల్లడించారు.

## కరెంటుపై బిఆర్ఎస్ నాయకులు అబద్ధ ప్రచారం



### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి విధ్వంసం సృష్టించారని, అడ్డగోలుగా దోచుకొని సింగరేణి విధ్వంసానికి బిఆర్ఎస్ ప్రభుత్వం కారణమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో కరెంటు కష్టాలకు కారణం గత బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. తక్కువ ధరకు దొరికే సోలార్ పవర్ ప్లాంట్ కు బదులు చతిస్గఢ్ లో మీ కమీషన్ల కోసం అధిక ధరలు పెట్టి కరెంటు కొనుగోలు చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేసి అప్పులపాలు చేశారని మండిపడ్డారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డి హయాంలో చెల్పూర్ కేటీపీ జెన్కో కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇక్కడ నెలకొల్పవలసిన పవర్ ప్లాంట్ ను యాదాద్రికి తరలించారని అన్నారు. అక్కడ వనరులు బొగ్గు, నీరు లేక ఉత్పత్తి కొంటుపడిందని తెలిపారు. బిఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇంజనీర్ల మాట వినకుండా తానే ఇంజనీర్లమని దోపిడికి అనుకూలంగా డిజైన్ మార్చి రాష్ట్రాన్ని 8 లక్షల కోట్లకు కు పైగా అప్పులు చేసి, సింగరేణికి 40 వేల కోట్లు బకాయి పెట్టింది బీఆర్ఎస్ పార్టేనని అన్నారు. ఎలినినో ప్రభావం వల్ల కరెంట్ కు ఇబ్బంది వున్న రైతుల కు కరెంట్ ఇవ్వాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే అధికార దాహంతో బిఆర్ఎస్ అబ్బద్దాలు ప్రచారం చేస్తుందని అన్నారు. భూపాలపల్లిలో కిటిపిపి పవర్ ప్లాంటులో 500, 600 మొగావాట్ల కరెంటు ఉత్పత్తి చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బిఆర్ఎస్ యాదాద్రిలో పవర్ ప్లాంట్ పెట్టి కరెంటే ఉత్పత్తి చేయలేక పోయిందని, కమీషన్ల కోసం యాదాద్రికి పవర్ ప్లాంటును మార్చిందని అన్నారు. కేంద్రానికి అప్పులు కట్టుకుంటూ ఎన్ని కష్టాలు ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కాంగ్రెస్ చైర్మెన్ అయిత ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బుర్ర కొముయ్య, వైస్ చైర్మెన్ అంబాల శ్రీనివాస్, పిసిసి సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిప్పాల రాజేందర్, చల్లూరి సమ్మయ్య, ఇస్లావత్ దేవన్, సాంబమూర్తి, గుర్జాల రవి, కౌన్సిలర్లు అప్పం కిషన్, రాధ, బొద్దు అశోక్, సహదేవ్, అరున్‌రావు, పసునూటి రాజేందర్, మధూకర్‌రెడ్డి తదిరులు ఉన్నారు.

## వ్యాపారులకు 'హుండీ'..గ్రామ పంచాయతీలకు 'గండి'

### లైసెన్సులు నిల్..వ్యాపారాలు ఫుల్..?

### పట్టించుకోని మండల జిల్లా అధికారులు

**ప్రజాపక్షం/చిట్యాల:** గ్రామ పంచాయతీలకు ఆదాయం తేవాల్సిన ట్రేడ్ లైసెన్సుల వ్యవహారాన్ని చిట్యాల మండలంలో పూర్తిగా గాలికి వదిలేశారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 500కి పైగా కిరాణా షాపులు, ఎరువుల దుకాణాలు, మెడికల్ షాపులు, ఎరువుల దుకాణాలు, మెడికల్ షాపులు, హోటల్స్, బిల్డింగ్ మెటీరియల్, తదితర వ్యాపార దుకాణాలు, రైస్ మిల్లుల వ్యాపారాలు కొనసాగుతున్నాయి. కానీ అందులో 100లోపు దుకాణాలకు కూడా ట్రేడ్ లైసెన్సులు లేవు. ఎలాంటి లైసెన్సులు లేకుండానే గ్రామాల్లో వ్యాపారులు లక్షల్లో వ్యాపారం చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు, పల్లె సీమలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంటూ ఆ మాటనే అధికారుల నిర్లక్ష్యం సమాధి చేస్తుంది.

**నిబంధనలు ఉన్నా అమలుపై నిర్లక్ష్యం**

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి వ్యాపార సంస్థ ఏటా ఏప్రిల్ 1లోగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలి. అదేవిధంగా పాతవి రెన్యూవల్ చేసుకోవాలి. కానీ చిట్యాల మండలంలోని ఏ ఒక్క మేజర్ గ్రామ పంచాయతీలో కూడా 80 శాతం దుకాణాలు లైసెన్సు లేకుండానే నడుస్తున్నాయి. అయినప్పటికీ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి నోటీసులు ఇవ్వడం లేదు. దీనితో ఆయా షాపుల యజమానులు లైసెన్సు కోసం ఎలాంటి దరఖాస్తు చేయడం లేదు.




**చేతి తడితేనే చెల్లుబాటు..ఆదాయానికి చెల్లుపోటు**

క్షేత్రస్థాయిలో ఆరా తీస్తే అసలు విషయం బయడపడింది. దుకాణం పెట్టినప్పుడు కార్యదర్శికి రూ.2వేల నుండి రూ.5వేలు ఇస్తే చాలు, ఏడాదంతా లైసెన్సు లేకుండానే వ్యాపారం చేసుకోవచ్చనే పరిస్థితి ప్రస్తుతం గ్రామంలో నెలకొంది. దీనితో పంచాయతీకి హరిత నిధి, లైసెన్సు రుసం రూపంలో రావాల్సిన లక్షల ఆదాయం రాకుండా పోతోంది. నిధుల్లేక గ్రామాల్లో డ్రైయినేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్యలు అలాగే ఉంటున్నాయి.

**ఆన్‌లైన్‌లో ఈజీ... అవగాహన కరువు**

ప్రభుత్వం ట్రేడ్ లైసెన్సును పూర్తిగా ఆన్ లైన్ చేసింది. పంచాయతీ పోర్టల్‌లో ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫోటో పెట్టి, ఆన్‌లైన్‌లో ఫీజు కడితే 7 రోజుల్లో లైసెన్సు ఇంటికే వస్తుంది. ఇంత సులభతరం విధానం ఉన్న కార్యదర్శులు అవగాహన కల్పించకపోవడంతో వ్యాపారులు నిర్లక్ష్య వైఖరితో దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఏదేమైనా చిట్యాల మండలంలోని ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు సంబంధిత అధికారుల మామూళ్ల వ్యవహారానికి చెక్ పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**జిపి కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయ లోపమే కారణమా..!**

రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికి ప్రజా ప్రభుత్వం పల్లెల అభివృద్ధి కోసం పాటుపడుతుంటే అది మరిచి, మండల వ్యాప్తంగా ఉన్న జిపిలలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ట్రేడ్ లైసెన్సులతో కొంత మేర నిధులను సమకూర్చుకొని ఆదాయాన్ని పెంచుకోవడంలో జిపి కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయ లోపమే కారణమంటూ, అలాగే మండల, జిల్లా అధికారుల పూర్తి నిర్లక్ష్యమే దీనికి నిలువెత్తు నిదర్శనం అంటూ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తుతో ఉన్న నిర్లక్ష్యం వదిలి పంచాయతీల అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం / వేలేరు : ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించి, బోధనేతర పనుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వేలేరు మండలంలోని జడ్‌పిహెచ్‌ఎస్ పీచర ప్రభుత్వ పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.బోధనలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని,ప్రతి మండలానికి అవసరాన్ని బట్టి అన్ని పాఠశాలకు పిఎస్ హెచ్ ఎమ్ ను కేటాయించి,ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల అంశంపై కూడా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని జి ఒ 25 ను రద్దు చేసి పేపర్ మూల్యాంకనంలో ఎస్ ఎ 1,ఎస్ ఎ 2 పరీక్షలకు గతంలో అమలు చేసిన విధానాన్నే కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చదువుతో పాటు పరిశుభ్రతను బాధ్యతగా చేపట్టాలి

ఎంపిఒ కూచన ప్రకాష్

ప్రజాపక్షం/రాయపర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూనే, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను తమ ప్రధమ బాధ్యతగా నిర్వర్తించాలని రాయపర్తి మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని మైలారం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమానికి సర్పంచ్ చిర్ర వేణు కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఉమాదేవి, ఎండి అజీమున్నీసా బేగం, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి విజయేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో పోషణ మాసం..



ప్రజాపక్షం /నడికూడ : నడికూడ మండలం రాయపర్తి సెక్టార్ రాయపర్తి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయపర్తి గ్రామ సర్పంచ్ రాజాజగత్ ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే ఆరోగ్యలక్ష్మి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పిల్లలకు ప్యాకె ట్ ఫుడ్స్, కూల్డ్రింక్స్, కాకుండా ఇంట్లో తయారుచేసిన ఆహార పదార్థాలు పెట్టాలని తెలియజేశారు. సూపర్వైజర్ మాట్లాడుతూ పోషకాహారం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చని మన కు అందుబాటులో ఉన్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని బాలింతలు, చిన్నారుల తల్లులు, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

# 1911 నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం...

నెక్కొండ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

కాలం మారినా చెక్కుచెదరని ఆనవాళ్లు..

చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూ అభివృద్ధి చేయాలి

ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ మండల కేంద్రంలో ఉన్న ఆర్ అండ్‌బీ అతిథి గృహం 1911 నాటి నిర్మాణానికి గుర్తుగా నిలుస్తోంది. భవనం పైభాగంలో '1911 ఏడి' అని నమోదై ఉండడం నెక్కొండకు శతాబ్దానికి పైబడిన చరిత్ర ఉందనడానికి కనిపించే ఒక ముఖ్యమైన ఆనవాలు. శతాబ్దం దాటినా భవనం ఆనవాళ్లు నేటికి కనిపిస్తుండడం విశేషం. 1911లో నెక్కొండ ప్రాంతం అప్పటి హైదరాబాద్ సంస్థానంలోని వరంగల్ ప్రాంతంలో ఉండేది. చారిత్రక రికార్డుల ప్రకారం 1905లో హైదరాబాద్ సంస్థానంలో వరంగల్ డివిజన్ ఏర్పాటైంది. 1956లో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో వరంగల్ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో చేరగా, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నెక్కొండలో 1911 నాటికే ప్రభుత్వ నిర్మాణం ఉండడం గ్రామానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తోంది. అప్పటి నిర్మాణ శైలి, భవనం రూపురేఖలు, దానిపై చెక్కిన తేదీ నాటి పరిస్థితులను నేటి తరానికి పరిచయం చేసే ఆధారాలుగా నిలుస్తున్నాయి. అభివృద్ధి పేరుతో చారిత్రక ఆనవాళ్లు కనుమరుగుకాకుండా వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో నెక్కొండను మండల కేంద్రంగా మరింత అభివృద్ధి చేస్తూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, ప్రజా రవాణా, కొత్త రైల్వే హాల్టింగ్ కల్పిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య, విద్యా సదుపాయాలు వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. చరిత్రను కాపాడుకుంటూనే ఆధునిక సదుపాయాలతో నెక్కొండను అభివృద్ధి చేయడం ద్వారా గత వైభవానికి గౌరవం, భవిష్యత్ తరాలకు మెరుగైన పట్టణం అందించినట్లవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## పండిట్ దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగించాలి

కెడిసి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్



ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కేడీసీ కళాశాలలోపండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధితో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయులు విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం అంత్యోదయ భావనలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యాన్ని చాటిచెప్పాయని పేర్కొన్నారు.మై భారత్ ప్రోగ్రాం ఇంచార్జ్ రాజేష్ మాట్లాడుతూ ప్రజాసేవ, దేశసేవకు ఆయన జీవితం ఆదర్శమని, యువత ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం దీన్ దయాల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయడం జరిగింది, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ప్రధమ బహుమతి అక్షయ ద్వితీయ బహుమతి భవిత, తృతీయ బహుమతి కార్తీక్ బహుమతులను ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజశేఖర్ ,రజనీలత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్,డాక్టర్ బి సీతారాం,డాక్టర్ గన్ సింగ్, డాక్టర్ మాలతి, అధ్యాపక బృందం డాక్టర్ వీరన్న, డాక్టర్ రమేష్, డాక్టర్ జీకే కుమార్, విద్యార్థిని ,విద్యార్థులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో యోగా కార్యక్రమం



ప్రజాపక్షం/హనుమకొండ : ఆరోగ్య ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, టూరిజం నోడల్ అధికారి ఎన్. రవి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని యోగ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగ సాధన చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారని, అదేవిధంగా ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి లేకుండా ఉండేందుకు యోగ దోహదపడుతుందన్నారు. యోగ ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, యోగ సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం పట్ల అభినందనలు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : త్రినగరి అయిన కాజీపేట, వరంగల్, హనుమకొండ లో సుమారు 10 వేల గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగియడం ఎంతో సంతోషకరమైన విషయమని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వారి యంత్రాంగానికి, రెండు రోజులపాటు నిద్ర, ఆహారాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీస్ శాఖ సిబ్బందికి, వారందరినీ సమన్వయం చేసిన జిల్లా పోలీస్ కమిషనర్‌కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అవిశ్రాంతంగా పనిచేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.వర్షం కురుస్తున్నా, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని సహకరించిన భక్తులు, యువత, ప్రజలు, స్వచ్ఛంద సేవకులు, అన్ని వర్గాల వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సుమారు 10 వేల విగ్రహాల నిమజ్జనం ఇంత ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తికావడం ఆ భగవంతుని ఆశీస్సులే అని నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి సమన్వయం, సహకారం, సంయమనం వల్లే ఈ మహత్తర కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు.నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ నిమ్మల శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వనం భాస్కర్‌కు జర్నలిస్టుల ఘన నివాళులు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వనం భాస్కర్ కుటుంబానికి ప్రెస్ క్లబ్ నుండి 25,000 రూపాయలు సాయం అందించారు. భాస్కర్ మృతి దురదృష్టకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో టీయూడబ్ల్యూజే 143 వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరకొప్పుల నరేందర్, ఐజేయూ వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, కమటం వేణు గోపాల్, సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాస్, అడప మహేష్, జన్ను స్వామి, కందుల శ్రీధర్,పెరుమాండ్ల మధు, బండి రవి, మోహన్, చినబాబు, నీలం శివ, ఉమాశంకర్, పాషా, అక్రం, రాజేశ్, శ్యాం, గంగరాజు, కృష్ణాకర్, సాయి, తదితరులు ఉన్నారు.

## తాళ్ల మల్లేషం కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రముఖ విద్యావేత్త లెర్నర్స్ ల్యాండ్ సంస్థల వ్యవస్థాపకుడు తాళ్ల మల్లేశం ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎంఎల్‌సి బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శుక్రవారం పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. వీరి వెంట పిసిసి సభ్యులు నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజ్ శిరీష శ్రీమన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, డిసిసి కార్యదర్శి దూపం సంపత్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మి, మహిళా నాయకురాలు గిరిగిరి పుష్ప, ఎండి ఇదా, పులకుర్తి సదానందం, కడారి లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

## యాసంగిలో ఎరువులు, విత్తనాల సరఫరాలకు చర్యలు



ప్రజాపక్షం/జనగామ :ఎల్నినో ప్రభావం దృష్ట్యా జనగామ జిల్లాలో ముందస్తుగా యాసంగి రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలకు చర్యలు చేపడుతున్నట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తెలిపారు. శుక్రవారం యాసంగి సీజన్ సన్నద్ధతపై వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయ సమావేశంలో జరిగింది. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, పప్పుధాన్యాల పంటల వైపు మొగ్గు చూపేలా క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేల, నీటి సంరక్షణ పద్ధతులకు అనుగుణంగా సాగు చేయాలన్నారు. సూక్ష్మ సేద్యం, స్ప్రింక్లర్ల సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతుల లభ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు డిపిడి విజయశ్రీ, అపర్ణ, లక్ష్మ న్ పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

## కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** వయోవృద్ధుల సంక్షేమం వారి రక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం, రక్షణకు జీవనానికి ప్ర భుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం2007పై ప్రజలు, కుటుంబ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వయోవృద్ధుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి అవసరమైన సహాయం, భద్రత ,సంక్షేమ సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా వయోవృద్ధుల హక్కులు, ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు , చట్టపరమైన రక్షణపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జి.మల్లేశ్వరి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ అర్జున్, డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కొలగూరి సంజీవరావు, సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఇరువైపుల గుంతలు పూడ్చివేత

ప్రజాపక్షం/లింగాలఘణపురం: మండలం లోని గ్రామంలోని గల జనగాం సూర్యాపేట జాతీయ రహదారిపై వర్షాల ప్రభావంతో ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో, స్థానిక సర్పంచ్ సర్పంచ్ లఫోరం మండల అధ్యక్షులు నర్సింగ రామకృష్ణ పర్యవేక్షించి, ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా, శుక్రవారం రోడ్డు ఇరువైపులా గుంతలలో ట్రాక్టర్లతో మట్టి పోసి గుంతలను పూడ్చి వేశారు. ఈ కార్యక్రమంలో కొత్తకొండ గంగాధర్ కొర్రముల ఉపేందర్ గుర్రం సందీప్, అంబాల మహేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌పాండ్‌లతో భూగర్భజలాల పెంపు

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంచేదుకు రైతులు ఫామ్ పాండ్‌లను నిర్మించుకోవాలని బచ్చన్నపేట స ర్పంచ్ అల్వాల నర్సింగరావు సూచించారు. శు క్రవారం బచ్చన్నపేట గ్రామ పంచాయితి పరిధిలోని చెక్క వెంకటేష్, ఎద్దుగూడెం ప్రాంతాలలో చేపడుతున్న ఫామ్ పాండ్ నిర్మాణ పనులను సర్పంచ్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా రైతులు ఫారం పాండ్లను నిర్మించుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఫారం పాండ్ నిర్మించుకోవా లనుకునే రైతులు గ్రామ పంచాయితిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైరు రజిత వెంకటేష్, పంచాయితి కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యులు మాధవి, మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, రైతులు, ఉపాధి హామీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపం వద్ద కుంకుమ అర్చన



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**మండలం లోని కుందారం గ్రామంలోని గల పురాతన ఎల్లమ్మ దేవాలయం వద్ద , గణేష్ మండపం వద్ద షాడో టైగర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం, వేద పండితులు శరత్ కుమార్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ అర్చన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని వారు తెలిపారు. గ్రామ ప్రజలు భక్తులు, యూత్ నాయకులు షాడ పరుశరాములు భానుచందర్, ప్రకాష్, కన్ని, రామ్‌చరణ్,రాఘవ, పల్సర్ రాజ్ పాల్గొన్నా రు.

# ఆదివాసి గూడెంలు అభివృద్ధికి ఆమడదూరం



**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతం మంగపేట మండలంలోని 25 గ్రామపంచాయతీలల్లో ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజుల పాలన దాటిన స్థానిక ఆదివాసి గిరిజన గూడెంలల్లో గ్రామాలలో తాగునీరు సిసి రోడ్లు డ్రైనేజీలు పాఠశాల భవనాలు గ్రామాలలో మౌలిక వసతులు సదుపాయాలు లేక గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చి వెయ్యి రోజులు దాటిన గిరిజన గ్రామాలలో తట్టడీ మట్టి పోసిన దాఖలు లేవు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మండలానికి వచ్చినప్పుడల్లా వివిధ రకాల పనులకు శంకుస్థాపన చేసి వెళుతున్నారు కానీ స్థానిక ఆదివాసి గూడేలలో గ్రామాలను అభివృద్ధి చేయడానికి మాత్రం నిధులు ఉండవా? వలస వచ్చిన గుత్తి కోయ గూడెలపై ఉన్న ప్రేమ స్థానిక ఆదివాసులపై లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నరసింహ సాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శనగకుంట గ్రామంలో పాఠశాల భవనం లేక 45 మంది గిరిజన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు అని మండల ఎంపిడిఒకు, మండల విద్యాశాఖ అధికారి ఎంఇఒకు, జిల్లా అధికారి డిఇఒకు, జిల్లా కలెక్టర్‌కు, మంత్రి సీతక్కకు, పలుసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది కానీ స్థానిక ఆదివాసి గిరిజనుల సమస్యలను పట్టించుకున్న నాధులే లేరు. ఆదివాసి సంఘాలుగా ఆదివాసుల సమస్యలపై, ఆదివాసి గుడెల గ్రామాల అభివృద్ధికై నిరంతరం ఆదివాసీ ప్రజల పక్షాన మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ సంఘం తరుపున పోరాటం చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఆక తిరుమలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్, ఎట్టి రవీందర్, ఇరప హనుమంతు, ఇర్ప రాంబాబు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం దృష్టి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్ర ప్రభు త్వం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్‌లో విద్యార్థుల భద్రతపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిద్రిస్తున్న 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన సంఘటనపై శుక్రవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల ముందు దయాకర్‌రావును అడ్డుకోవడంతో గేటు ముందు ధర్నా చేపట్టారు. సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర సెక్రటరీతో మాజీ మంత్రి దయాకర్‌రావు ఫోన్‌లో మాట్లాడి గురుకుల విద్యార్థినుల పరిస్థితిని వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న, బిఆర్ఎస్ నాయకులు నవీన్, అశోక్ రెడ్డి, నాగిరెడ్డి, పాపారావు, సురేష్, అశోక్, మధు, వెంకటయ్య, శ్రీనివాస్, సైదులు, రాజ్, మహ్మద్ సతీష్, నారాయణ,మీనా,నాగరాజు,రమేష్, తదితరులున్నారు.

**బిజెపి ఆధ్వర్యంలో...**

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సుమారు 14 మంది విద్యార్థినులను ఎలుకరిచిన సంఘటనపై బిజెపి ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్ రెడ్డి, దొంగరి మహేందర్ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమయ్యారని ఆరోపించారు. విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, దేవరాజు, సోమేశ్వర్, తదితరులున్నారు.

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...**

వెలుగు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులను ఎలుకలు కొరికిన సంఘటనపై ఎస్ఎఫ్ఐ, సిపి(ఐ)ఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గేటు ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లవకుమార్, సిపి(ఐ)ఎం జిల్లా కమిటి సభ్యుడు చిట్యాల సోమన్న మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో గురుకుల పాఠశాల యాజమాన్యం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల సంఘటన జరిగినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దార్, ఇంద్రారెడ్డి, మానస, శ్రీకాంత్, ప్రశాంత్, అరవింద్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి గ్రీష్మను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ శ్రీలత ల కుమార్తె గ్రీష్మ నూతన వస్త్రలంకరణ కార్యక్రమం ఎల్లందు ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారి గ్రీష్మను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, నాయకులు చల్లూరి మధు దేవన్, పిప్పాల రాజేందర్, ఇస్లావత్ దేవన్ సాంబమూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ‘చలో యాదగిరి గుట్ట’ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ములుగు:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో ఈ నెల 27న జరుగు సదస్సును జయప్రదం చేయాలని టఫ్ జిల్లా అధ్యక్షుడు పోరిక గోవింద్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం వెంకటాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పోరిక గోవింద్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్ర య్య, సీనియర్ నాయకులు పల్నాటి రమేష్, మాజీ ఎంపిటిసి గా జుల శ్రీనివాస్, జహీర్ పాషా, బోయిని సదయ్య, జంగిలి మహేందర్, జరుపుల రమేష్, అల్లేపు రవి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/రేగొండ:** పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 26వ తేదీ శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్ట వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక దినోత్సవాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాట అధికారి రఘు, అటవీ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

**ప్రజాపక్షం/ జనగామ :** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వయించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాధాన్యత, జిల్లా చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను, ప్రజలకు తెలియజేసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్రీడా ప్రతిభ కనబర్చిన జి సునీత్ కుమార్‌ను, అండర్ 20 షాట్‌పుట్ విభాగంలో పుదుచ్చేరిలో నిర్వహించిన సౌత్ జోన్ జూరియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడవ స్థానం సాధించిన సునీత్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, యువతీ యువకులు, విద్యార్థులు, టూరిజం క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని సన్మాణించారు.

## రాచకొండ సోమయ్యకు సిపిఐ నాయకుల ఘన నివాళులు

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని తీర్మలాయపల్లి గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు రాచకొండ సోమయ్య గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు జిల్లా సమితి సభ్యులు గాజు యాకయ్య, మండల కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, తెలంగాణ ప్రజా నాణ్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి శుక్రవారం సోమయ్య పార్థివ దేహాన్ని సందర్శించి పార్థివ దేహంపై సిపిఐ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సిపిఐ మండల సహాయ కార్యదర్శి కడమంచి యాదగిరి, సిపిఐ సీనియర్ నాయకులు బండి ఉప్పలయ్య, బండి పెద్ద ఎల్లయ్య, బండి రాజు, రఘు యాదవ్, మచ్చ రాములు, పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎంపిడిఒలు

**ప్రజాపక్షం/కాటారం;** మండలకేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కాటారం,మల్హార్,పలిమెల,మహాముత్తారం మండలాల ఎంపిడిఓలు సబ్ కలెక్టర్ సౌరభ్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయా మండలాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు,పంచాయితీ రాజ్ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఎండిపిలతో చర్చించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.అభివృద్ధి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓలు బాబు,ని శాంత్ ,క్రాంతి,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు కీ.శే ఎక్కటి సంజీవరెడ్డి శుక్రవారం రోజున మరణించగా వారి ఇంటికి వెళ్ళి, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన కీ.శే నల్ల రాజిరెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీతారాంపురం గ్రామ వాస్తవ్యులు కీ.శే ఓదెల బసవయ్య, రోడ్డు ప్రమాదంలో ఆలయ అర్చకులు కీ.శే సముద్రాల రాకేష్ మరణించగా వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ ఓదాకర్ తలకి శస్త్ర చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మి నరసింహారావు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ పూర్ణచందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మంద అశోక్‌రెడ్డి, కొండాపూర్ సర్పంచ్ విజయ అశోక్, సీతారాంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు వైనాల వెంకటేష్, మాజీ సర్పంచ్ రామంచ భద్రయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం, సమరం సాగాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** బిసి, ఎస్‌సి, ఎస్‌టి బానిసత్వం కటిక పేదరికం అణిచివేత బద్దలు కొట్టాలంటే ఒక రాజకీయ భూకంపం జనంలో రావాలని, ప్రజలలో సామాజిక న్యాయం సమరం సాగాలి. రాజ్యాధికార యుద్ధం రగిలించాలని అప్పుడే అసలైన ప్రజాస్వామ్యమని మాదిగ జాతి సంఘం జిల్లా కన్వీనర్ పర్లపల్లి వంశీ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి ఆధ్వర్యంలో పర్వపల్లి వంశీ మాట్లాడుతూ సామాజిక న్యాయం రాజ్యాధికారం అనే నినాదంతో బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి ఆధ్వర్యంలో ధర్మసమాజ్ పార్టీ మద్దతుతో ఎవరి కులమెంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ సభ ఈ నెల 27న హనుమకొండలోని హంటర్ రోడ్డు డి కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభకు మాదిగ జాగృతి సంఘం భూపాలపల్లి జిల్లా తరుపున సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని తెలిపారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు మేధావులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు వివిధ కుల సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక వాదులు, అందరూ ఈ సభలో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నమన్నారు.

## మంతి పర్యటనను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** జనగామ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం జనగామ జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు మహ్మద్ మసూద్ పిలుపునిచ్చారు. మంత్రివర్యుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతోపాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గృహ ప్రవేశాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# బిసిలంతా రాజకీయాలకతీతంగా ఏకం కావాలి

### జనాభా లెక్కలతో పాటు బిసి కులగణన చేపట్టాలి:తాటిపాముల వెంకట్రాములు




**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** దేశంలో జరుగుతున్న జనాభా లెక్కలతో పాటు బిసి కులగణన చేయడానికి గత 80 సంవత్సరాల నుండి అగ్రకుల పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ససేమిరా అంటున్నాయని ఈ జనాభా లెక్కలతో పాటే బిసిల లెక్కలు తీసేంత వరకు వాటా సాధించే వరకు బిసిలంతా ఏకంగా ఉద్యమించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. అక్టోబర్ 16న వరంగల్ జిల్లా బిసి హక్కుల సాధన సమితి రెండవ మహాసభ విజయవంతం కోసం భూపేష్ నగర్‌లోని బిసి కమ్యూనిటీ హాలులో చీకటి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఆహ్వాన సంఘం సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వెంకట్రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిల ఓట్ల కో సం మాత్రమే పోటి పడుతున్నాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం బిసిల అభివృద్ధికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ రంగాల్లో స్థానిక సంస్థలలో అసెంబ్లీ పార్లమెంట్ స్థానాలలో బడ్జెట్‌లో వాటా ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులు షేక్ బాషామియా, పనాస ప్రసాద్‌లు మాట్లాడుతూ న్యాయమైన బిసిల హక్కుల కోసం బిసి హక్కుల సాధన సమితి నిరంతరం చేస్తున్న కృషిని అభినందిస్తున్నామన్నారు. జిల్లా మహాసభ విజయవంతానికి తమవంతుగా పదివేల రూపాయలను విరాళంగా అందిస్తామని ప్రకటించారు. ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబమూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా రావుల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చింతకింద కుమారస్వామి, కోశాధికారిగా పాము మనోహర్‌తో పాటు 50 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో చిలుకల రాజు, సల్లూరి నరేందర్, పుల్లూరి కుమారస్వామి, శైలజ, రాంబాయి, ఆరెల్లి ప్రభాకర్, మేరుగు రంజిత్, పాల్గొన్నారు.

# రబీ ప్రణాళికపై అధికారుల సమన్వయ సమావేశం

**ప్రజాపక్షం/హనుమకొండ :** రబీ సీజన్ కార్యాచరణ ప్రణాళిక, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై వ్యవసాయ, అనుబంధ రంగాల జిల్లా అధికారులు, శాస్త్రవేత్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి వి. విజయచంద్ర అధ్యక్షతన కలెక్టరేట్ లోని జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం జరిగింది. రబీలో అపరాలు, ఆరుతడి, ఉద్యాన, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల ద్వారా రైతుల ఆదాయం పెంచేలా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.ఆత్మనిర్భర్ భారత్/మిషన్ పథకం కింద అపరాలు, జాతీయ ఆహార భద్రతపోషకాహార మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) కింద మక్కజొన్న, వరి, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు తదితర పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, అవసరమైన ఇన్పుట్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరువులను ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై అన్ని మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఉద్యానవన, మత్స్య, ఇరిగేషన్, సహకార శాఖల అధికారులు తమ పరిధిలోని రబీ కార్యాచరణను వివరించారు. రైతులకు సమగ్ర సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి సూచించారు. అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలన

**ప్రజాపక్షం/వరంగల్ :**వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన



పనుల నాణ్యతను, చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధునాతన ఇఎన్‌టి వాయిస్,ఎయిర్‌వే చికిత్సలు




**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** యశోద హాస్పిటల్స్ లో సమగ్ర ఈ ఎన్ టి వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ, లారింజాలజీ, పీడియాట్రిక్, ఎయిర్‌వే సర్జరీ, హెడ్ నెక్ సర్జరీ, రైనాలజీ ,స్కల్ బేస్ సర్జరీ, ఓటాలజీ, అలర్జీ వంటి విభాగాల్లో అధునాతన వైద్య సేవలను అందించే ప్రత్యేక నిపుణుల బృందం అందుబాటులో ఉందని యశోద హాస్పిటల్స్ డాక్టర్ ఆశిష్ డోరా తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాయిస్, మింగడంలో సమస్యలు, పిల్లల్లో శ్వాసనాళాలకు సంబంధించిన సమస్యలు, లారింగోట్రాకియల్ స్టెనోసిస్, స్వరపేటికకు సంబంధించిన సమస్యలు, గురక, నిద్రలో శ్వాసకు సంబంధించిన సమస్యలు, అలాగే ఇతర క్లిష్టమైన శ్వాసనాళ సమస్యలకు ఈ బృందం ప్రత్యేక పరీక్షలు, వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలను అందిస్తోందన్నారు.హైడెఫినిషన్ ఎండోస్కోపీ , న్యారో బ్యాండ్ ఇమేజింగ్ నబీ, స్ట్రోబోస్కోపీ స్ట్రోభోకాపీ వంటి ఆధునిక నిర్ధారణ సదుపాయాలు, అలాగే అధునాతన శస్త్రచికిత్సా పద్ధతుల సహకారంతో, వివిధ ఈఎన్టీ సబ్‌స్పెషాలిటీల నిపుణుల సమన్వయంతో ఒకే చోట సమగ్ర, శాస్త్రీయ ఆధారాలతో కూడిన, రోగికేంద్రిత వైద్య సేవలను అందించడమే ఈ యూనిట్ లక్ష్యం అని, ఈ నిపుణుల బృందంలో లారింజాలజీ, పీడియాట్రిక్ ఈఎన్ టి ఎయిర్‌వే సర్జరీ, అలర్జీ, ఓటాలజీలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన డాక్టర్ అశీష్ డోరా, నెక్ ఆంకో సర్జరీ, రైనాలజీ,స్కల్ బేస్ సర్జరీలో నైపుణ్యం కలిగిన డాక్టర్ ఎన్. అపూర్వా రెడ్డి, అలాగే జూనియర్ కన్సల్టెంట్ ఈఎన్ టి డాక్టర్ దీప్తాబా మిశ్రా ఉన్నారు.సాధారణ ఈఎన్టి సమస్యల నుంచి సంక్లిష్టమైన ఈఎన్ టి, వాయిస్, ఎయిర్‌వే సమస్యల వరకు అన్ని రకాల పరిస్థితులకు సమగ్ర ఇఎన్టీ కేంద్రంగా సేవలందించడమే మా లక్ష్యం అని,వివిధ ఈఎన్టి సబ్‌స్పెషాలిటీల నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ, రోగులకు ప్రత్యేకమైన, సమగ్ర వైద్య సేవలను అందించాలనుకుంటున్నామని డాక్టర్ అశీష్ డోరా ఘన్‌పూర్ తెలిపారు.

## ఆత్మగౌరవ భవనాల కోసం ఉద్యమానికి సిద్ధం

**ప్రజాపక్షం/ములుగు:** జిల్లా కేంద్రంత పాటు ఏటూరునాగారం, మేడారంలో నాయి బ్రహ్మణ కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలని నాయి బ్రహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మేడారం జాతరకు సంబంధించి 2004లో జరిగిన ఒప్పందాలను అమలు చేసే వరకు సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రాంగణంలో నాయీ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దూరు రాములు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్న కుమార్, అధ్యక్షులు చిక్కుల వెంకటేష్, కార్యదర్శి ముత్యాల ప్రకాష్‌లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని నాయి బ్రహ్మణులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేల్పుగొండ శరబందం, జిల్లా కోశాధికారి దుబ్బాక ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల రాజు, మద్దూరు రాజు, అన్నం తిరుపతి, కురిమిల్ల సంపత్, జంపాల చంద్రశేఖర్, నడిగోటి వేణు, మర్రిపెల్లి కిషన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో 'పోక్సో' చట్టంపై న్యాయ అవగాహన

**ప్రజాపక్షం/గూడూరు;**స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం( కెజిబివి)లో శుక్రవారం పోక్స్( పిఓసీఎస్ఒ) చట్టం 2012 పై విద్యార్థినులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ వారి భద్రత సమాజంలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. లైంగిక వేధింపులు దాడులు నుంచి బాలలను రక్షించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్స్ చట్టం 2012 ని బంధనలు బాలల హక్కులు ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు సమగ్రంగా వివరించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే భయపడకుండా ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు లేదా చట్టబద్ధమైన సహాయ కేంద్రాలకు సమాచారం అందించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖలో ఫార్మసిస్టుల సేవలు కీలకం

**ప్రజాపక్షం/తొర్రూరు :** వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో కీలకమని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రి వైద్యులు శుక్రవారం సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లు కె.జ్యోతి, పారుపెల్లి మహేశ్వర్, ఆర్‌బి.ఎస్.కె ఫార్మసీ ఆఫీసర్ ఎన్.నిర్మలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ ప్రలకు నాణ్యమైన మందులు, ఔషద భద్రత సరైన మందుల వినాయోగం, రోగుల కౌన్సిలింగ్‌లో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌లు ఝాన్సీరాణి, ప్రమీల, జూనియర్ అనాలిస్ట్ అమ్రపాలి, వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ శంకర్, డాక్టర్ అనిల్, డాక్టర్ జ్వలిత, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ నందనాదేవి, డాక్టర్ మానస, ఫార్మసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శించిన చైర్‌పర్సన్ ప్రగతి

**ప్రజాపక్షం/మరిపెడ:**కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం ఆమె మరిపెడ మున్సిపాలిటి పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను కమీషనర్ కంచర్ల నరేష్ రెడ్డితో కలసి సందర్శించారు.ఈ సందర్బంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరుశాతం తదితర వివరాలు తెలుసుకున్నారు.తరగతి గదులు,వంటశాల,స్టాక్‌రూం,విద్యార్థులకు అందిస్తున్నా భోజనం,వాష్ రూమ్స్‌లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మెరుగు రాము,పానుగోతు రాములు,కోఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న,4వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ యాఖుబ్ పాషా,బయ్య లింగన్న,పాఠశాల హెచ్‌ఎం లాలు,వార్డెన్ రమేష్,టీచర్లు, రమేష్,కృష్ణ,మొతిలాల్,జయలక్ష్మి ,వార్డు ఆఫీసర్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రమశిక్షణ గాడి తప్పిందా?

**ప్రజాపక్షం / మెదక్ :** వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, ఎందరో మేధావులను సమాజానికి అందించిన మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసలేం జరుగుతోంది..? క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన విద్యా సంస్థలో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయా..? డిగ్రీ కళాశాలలో క్రమశిక్షణ గాడి తప్పిందా.? అంటే అవుననే సమాధానం వస్తుంది. అధ్యాపకులు, విద్యార్థుల వ్యవహారశైలి కళాశాల ప్రతిష్ఠను ప్రశ్నార్థకం చేస్తోందా..? అన్న ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతున్నాయి.విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పాల్సిన అధ్యాపకులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వినిపించడం ఆందోళన కలిగించే అంశం. విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన వారిపైనే ఇలాంటి ఆరోపణలు వస్తే బాధ్యత ఎవరిది..? ఆరోపణల్లో వాస్తవాలెంత..?



వాటిపై రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ, కళాశాల యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది..? అన్నది తేలాల్సి ఉంది.

**కళాశాల ప్రిన్సిపల్ పర్యవేక్షణ ఏమైనట్లు..?**

కళాశాల నిర్వహణలో ప్రిన్సిపల్ పాత్ర కీలకం. అధ్యాపకుల పనితీరు, విద్యార్థుల క్రమశిక్షణ, విద్యా వాతావరణం పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రిన్సిపల్‌పై ఉంటుంది. అలాంటప్పుడు కళాశాలలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై యాజమాన్యం దృష్టి సారిస్తోందా..? లేక బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తోందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలకు ఆటానమస్ హోదా తీసుకురావడం, కళాశాల అభివృద్ధి, సెమినార్లు, సమావేశాలు, ఇతర విద్యా కార్యక్రమాలపై ప్రిన్సిపల్ ప్రత్యేక దృష్టి పెట్టడం అభివృద్ధి కోణంలో స్వాగతించదగిన అంశమే. అయితే అదే సమయంలో కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల క్రమశిక్షణను పర్యవేక్షించేది ఎవరు..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.కళాశాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించడం ఎంత ముఖ్యమో, ఆ ప్రణాళికలు అమలయ్యే విద్యా వాతావరణాన్ని క్రమశిక్షణతో కొనసాగించడం కూడా అంతే ముఖ్యం. ప్రిన్సిపల్ ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటే అధ్యాపకుల హాజరు, బోధనా విధానం, విద్యార్థుల ప్రవర్తన, కళాశాల నిబంధనల అమలును పర్యవేక్షించే వ్యవస్థ ఏది..? అనే ప్రశ్న తలెత్తుతోంది.

## మాజీ మంత్రి హరీష్‌రావు పరామర్శ



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** శ్రీకాంత్ గౌడ్ కుటుంబానికి మాజీ మంత్రి హరీష్‌రావు పరామర్శించి కుమార్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పటాన్చెరు మాజీ జెడ్పీటీసీ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడీల శ్రీకాంత్ గౌడ్ కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి లు పరామర్శించారు. శ్రీకాంత్‌గౌడ్ తండ్రి గడీల కుమార్ గౌడ్ రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇస్నాపూర్ లోని శ్రీకాంత్ గౌడ్ నివాసానికి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వెళ్లారు. ముందుగా కుమార్ గౌడ్ మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, ను పరామర్శించారు ఇటీవల కుమార్‌గౌడ్ తండ్రి గడీల ఈశ్వరయ్య గౌడ్, అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరారైన పాత నేరస్థుడు అరెస్ట్

**ప్రజాపక్షం/కొండాపూర్ :** కొండాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి నాలుగు రోజుల క్రితం పరారైనా పాత నేరస్థుడు ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ నియోజవకర్గం మనూరు మండలం తీమ్మాపూర్ తండాకు చెందిన బనావత్ అనిల్ (21) దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడిపై చిన్న చిన్న దొంగతనాల కేసులతో పాటు బీదర్ జిల్లా పరిదిలో నాలుగు దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లి బయటకు వచ్చినట్లు పేర్కొన్నారు. మల్కాపూర్ ,చింతల్ వద్ద పోలీసులు ఫింగర్ ప్రింట్ చెకింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనిల్ పట్టుబడ్డాడు. అనంతరం అతడిని కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్న క్రమంలో స్టేషన్ నుంచి పరారయ్యాడు.

## విద్యార్థులు సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలో పాల్గోనాలి



**ప్రజాఫక్షం/సంగారెడ్డిః** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసీ వారిని పోత్సహించేందుకు టూరిజం డిపార్మెంట్ నిర్వహించిన వివిధ పోటీల్లో సంగారెడ్డికి జిల్లాకు చెందిన పాఠశాలలు ,కళాశాలలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో జడ్‌హెచ్ఎస్ గుమ్మడిదల విద్యార్థులు ప్రథమ బహుమతి జడ్పీహెచ్ఎస్(బి) జోగిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి జడ్‌పీహెచ్ఎస్ సీంగం /కల్లబ్గూర్ విద్యార్థులు తృతీయ బహుమతి సాదించారు. అదే విధంగా కళాశాల స్థాయిలో తారా డీగ్రీ కళాశాల సంగారెడ్డి ప్రథమ బహుమతి ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు , ద్వీతీయ బహుమతి ఎంజేపిటీ కోహీర్ తృతీయ బహుమతి సాదించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్ల కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రొత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీలు ,సాంస్కృతిక ,సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను మరింతగా పెంపొందించకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. విజేతలను ఉపాద్యాయులు ,అద్యాపకులు ,విద్యాశాఖ అధికారులు అభినందించారు. టూరిజం ఇంచార్జీ అధికారి కెపివిఎస్ ప్రసాద్ రెడ్డి విద్యాశాఖ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు రిజిస్ట్రేషన్ కోసం 30లోగా నమోదు చేసుకోవాలి

**ప్రజాఫక్షం/సంగారెడ్డిః** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న రైతు రిజిస్ట్రేషన్ (పార్మర్ఐడి) ప్రక్రియలో భాగంగా జిల్లాలోని రైతులు ఈ నెల 30 లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అదికారి శివప్రసాద్ సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు అందే ప్రభుత్వ పథకాలు సేవలను మరింత సమర్థవంతంగా అందింంచడంతో పాటు రైతుల భూములు, పంటలు ఎరువులు ప్రభుత్వ పోత్సాహకాలు తదితర వివరాలను సమగ్రహంగా అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు పార్మర్ ఐడితో వరి , పత్తి మొక్కజొన్న కంది ,తదితర పంటల కొనుగోళ్లులో కనీస మద్దతు ధర పొందుటకు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా ఎరువుల కొనుగోళ్లలకు బ్యాంకుల ద్వార పంట రుణాలు పొందడానికి సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల పథకాలు సేవలు ఇతర సేవలు రైతులు సమర్థవంతంగా పొందవచ్చని రైతు సేవలు సబ్సిడీ లు ఇతర వ్యవసాయ సంబందిత సేవలు పొందవచ్చని తెలిపారు. రైతులు తమ సమీప రైతు వేదిక లోని వ్యవసాయ విస్తరణ అధికారి ని సంప్రదించి రైతు ఫార్మర్ ఐడి కోసం నమోదు చేసుకోవచ్చని ,సంబందిత మీ సేవ కేంద్రంలో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆదార్ కార్డు భూమి పాస్‌బుక్ ఆదార్‌కు అనుసందామనమైన మొబైల్ ను వెంట తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. రైతు లందరూ ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 30 లోగా ఫార్మర్ ఐడి కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అదికారి కోరారు.

## వైభవంగా రాంమందిర్ వినాయక నిమజ్జనం



**ప్రజాఫక్షం/సంగారెడ్డిః** సదాశివపేట పట్టణం లోని రాంమందిర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమము భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి చింత ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు ,శాంతి సౌభాగ్యం వెల్లివిరియాలనిఆకాంక్షించారు. గణేష్ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ప్రజలంతా ఐకమత్యంతో సోదరబావంతో పండుగలను జరుపుకోవాలని సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. వినాయకుడి కృపతో సంగారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు, ఈ కార్యక్రమంలో పట్టణ అద్యక్షుడు చీల మల్లన్న, కోడూరు. అంజన్న చింత గోపాల్ చింత సాయినాథ్, శ్రీదర్‌రెడ్డి, నగేష్, చెన్నకర్, సంక్షోయ్‌గౌడ్, నిజాంపురం అశోక్ ,జోగులు, మల్లికార్జున వంశీ కట్కం కిరణ్ యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

**ప్రజాపక్షం/చౌటకూరు :** బంజార గిరిజనులు విజయదశిమి లలిత పంచమిని పురస్కరించుకొని తీసుకునే 21 రోజుల దీక్ష వ్రత మహోత్సవాలు పుల్కల్ మండలం విట్టల్ నాయక్ తండాలో శుక్రవారం నాడు ఆల్ ఇండియా బంజారా లంబడ శక్తిపీట్ జాతీయ సహ కార్యదర్శి విఠల్ మహారాజ్ గిరిజనులకు మాలదారణ చేశారు. నాగలిగిద్ద వద్ద మాజీ జడ్పిటీసీ సభ్యులు రాజు రాథోడ్ ఆద్వర్యంలో దీక్ష మహారాజులకు వస్త్రాల పంఫిణి చేశారు. ఈ సందర్భంగా విట్టల్ మహారాజు మాట్లాడుతూ దీక్ష తీసుకోవడం వలన ఆద్మాత్మిక చింతన ,మానిసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. దీక్ష తీసుకోవడంతో గిరిజనల్లో చైతన్యం వస్తుందన్నారు. ఇదంతా బంజారా గిరిజనలు ఆరాద్య దైవం బాల బ్రహ్మచారి జగద్గురు సంత్ తపస్వీ రామ్‌రావ్ మహారాజ్ కృషి ఆశీర్వాదంత జరిగిందన్నారు. చౌటకూరు మండలం బొమ్మారెడ్డి గూడెం భవాని మాత సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద భవాని మాత సేవలాల్ మహారాజ్ దీక్షలు తీసుకున్న వారికి వస్త్రాలు అందజేశారు.

## నిమజ్జనాలు పూర్తియ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాఫక్షం/సంగారెడ్డిః** జిల్లా వ్యాప్తంగా వినాయక శోబాయాత్రలు ,నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జహిరాబాద్ నారింజ బిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లను ప్రత్యేక్షంగా పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో ఏర్పాటు చేసిన బారికేడింగ్ ,లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు భద్రతా చర్యలు తదతర అంశాలను పరిశీలించి సంబందిత అధికారులతో సమీక్షించారు. నిమజ్జన సమయంలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెరువులు ,వాగుల వద్ద ఈతగాళ్లు, లైప్ జాకెట్లు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా వాహనాల పార్కింగ్ ,బారకేడింగ్ లైటింగ్‌తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు వినాయక శోభయాత్రలు జరిగే మార్గల్లో ట్రాపిక్ అంతరాయం కలగకు ఒడా ట్రాపిక్ మళ్లింపులు చేపట్టాలని శోభయాత్రలు,నిమజ్జనాసమయంలోప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తియ్యే వరకు పోలీసు రెవెన్యూ మెడికల్ మున్సిపల్ విద్యుత్ తదితర శాఖల పరస్పర సమన్వయంతో అదికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని విదుల్లో ఏలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అధికారులను ఆదేశించారు.

## రబీ కార్యాచరణ ప్రణాళిక 2026 -27 పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ప్రస్తుత వాతావరణం సాగునీటి లభ్యత పంటల సాగు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ వ్యవసాయ శాఖ సంచాలకులు ఆదేశాల మేరకు రబీ కార్యచరణ ప్రణాళిక226 27 రూపకల్పన కోసం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం శుక్రవారం సంగారెడ్డి (డిఓసి) లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. శివప్రసాద్ అద్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాబోయే రబీ సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలోని వివిద మండలాల్లో రైతులు సాగుచేయనున్న పంటలు వాటికి అవసరమైన విత్తనాలు, ఎరువుల లభ్యత సాగునీఇ వసతులు తదితర వనరులను అంశాలపై సమగ్రంగా చర్చించారు. మంఢాలల వారీగా పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసి రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు, సకాలంలో అందుబాటులో ఉండేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని వ్యవసాయ జెడీ శివప్రసాద్ తెలిపారు.

## వినాయక స్వామి పల్లకి సేవ



**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ శ్రీ సిద్దిగణపతి దేవాలయంలో వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలో బాగంగా చివరి రోజైన శుక్రవారం సాయంత్రం దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి పల్లకి సేవ ,రథయాత్ర కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వారి కృపతో పటాన్చెరు నియోజకర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళతున్నామని తెలిపారు. ఇప్పటికి రాజగోపురాలు పూర్తి చేయడం జరిగిందని సాలహారం పనులు త్వరలో పూర్తికానున్నాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 11 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్‌కు ఘన స్వాగతం పలికారు.

# గుండ్లపల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/శివ్వంపేట:** శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో సర్పంచ్ మమతనర్సింహాయాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులు, చెత్త బుట్టలను పంపిణీ చేశారు. సర్పంచ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ కార్డుల ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, సబ్సిడి రేషన్ సరుకులు నేరుగా మరింత సులభంగా అందుతాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందజేసిన చెత్తబుట్టలలో చెత్త వేసి గ్రామ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మస్కురి సత్యనారాయణ, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శివ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నీటి లీకేజీని పరిశీలించిన అధికారులు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటలోని ప్రధాన రహదారిపై గల బస్టాండ్ వద్ద మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరంతా రోడ్డుపై పారుతుండడంతో శుక్రవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్ పరిశీలించారు. నీటి లీకేజీకి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి లీకేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

# భక్తుల వీడుకోలు గంగమ్మ వాడికి గణపయ్య



**ప్రజా పక్షం/ రేగోడుః** వినాయక నిమజ్జనాలు రేగోడు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం రేగోడు బసవ మండలి రాయచోటి సుభాష్ వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథునికి, గాంధీ చౌక్ వద్ద బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనాలు చేశారు గ్రామంలో శోభయాత్ర నిర్వహించి నిమజ్జనాలు చేసేందుకు స్థానిక చెరువులకు తీసుకెళ్లారు నిమజ్జనం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# స్టోన్ క్రషర్ ఏర్పాటు చేస్తే ఉద్యమం తప్పదు



**ప్రజాపక్షం/వెల్దుర్తి :** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ పరిధిలోని సర్వే నం. 580లో క్రషర్ ఏర్పాటు ప్రయత్నాలను విరమింపజేసి, ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రం అందజేశారు. కుకునూర్ గ్రామం, పరిధిలోని సర్వే నం. 580లో స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ప్రాంతానికి సమీపంలో నివాస ప్రాంతాలు, వ్యవసాయ భూములు, చెరువులు, రహదారి, విద్యుత్ లైన్ మరియు ఆలయాలు వంటి ప్రజా ఉపయోగకరమైన ప్రదేశాలు ఉన్నాయి. క్రషర్ ఏర్పాటు జరిగితే రాయి దుమ్ము, శబ్ద కాలుష్యం, భారీ వాహనాల రాకపోకలు, రోడ్డు భద్రత సమస్యలు, వ్యవసాయ పంటలకు నష్టం మరియు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సమీపంలోని ప్రజలు, రైతులు మరియు విద్యార్థులపై ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించవలసిందిగా కోరుతున్నాము. కాబట్టి సర్వే నం. 580లో క్రషర్ ఏర్పాటు కోసం జరుగుతున్న ప్రయత్నాలను తక్షణమే పరిశీలించి, సంబంధిత అధికారులు స్థల పరిశీలన నిర్వహించి, అన్ని నిబంధనలు మరియు ప్రజా భద్రతా ప్రమాణాలు పాటించబడుతున్నాయా లేదా అనేది నిర్ధారించవలసిందిగా కోరుతున్నాము. ప్రజలకు మరియు పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉన్నట్లయితే క్రషర్ ఏర్పాటు అనుమతులను నిలిపివేసి/రద్దు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

# నాణ్యమైన విద్య కోసం నిరంతరం పోరాటం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రభుత్వ బడుల బలోపేతం లక్ష్యంగా, నాణ్యమైన విద్య కోసం సమిష్టిగా నిరంతర పోరాటం చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి పిలుపు ఇచ్చారు. తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం గజ్వేల్ చేరుకున్న సందర్భంగా జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడులను బాగు చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, బడ్జెట్లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉందని, 40 లక్షల కుటుంబాలకు విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య మార్కెట్లో కొనుగోలు చేసే సరుకుగా మారిందని ఆరోపించారు. ప్రతి మండలానికి నాలుగు ఫౌండేషన్ పాఠశాలలు, ఆరుట్లలో నిర్మించిన విధంగా మండలానికి మూడు తెలంగాణ మోడల్ పాఠశాలలను నిర్మించి ప్రతిపాదించిన 52 అంశాలతో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. టీచింగ్, లర్నింగ్, సెక్యూరిటీతో కూడిన విద్యను పేద విద్యార్థులకు హక్కుగా అందించాలని చెప్పారు. తెలంగాణ మోడల్ స్కూల్ నిర్మాణానికి రూ 15 వేల కోట్ల నిధులను కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంవీ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం 37 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో, 63 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువు తున్నారని, ఇది ప్రభుత్వ బడులపై ప్రజల విశ్వాసం తగ్గుతున్న తీవ్రమైన ధోరణిని సూచిస్తుందనీ అన్నారు.

# హరీష్ రావు 60రోజుల పాటు కెసిఆర్ ఉచిత శిక్షణా



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజక వర్గ యువతి, యువకుల కోసం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి ఆధ్వర్యంలో ఉచిత కానిస్టేబుల్ శిక్షణా శిబిరం ప్రారంభం కానున్నట్లు నిర్వహకులు గందే నరేష్ తెలిపారు.. కెసిఆర్ ఉచిత శిక్షణ శిబిరం ద్వారా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి ఆధ్వర్యంలో 60 రోజుల పాటు ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.. ఇటీవల దరఖాస్తు లు స్వీకరించి అర్హత పరీక్ష నిర్వహించడం జరిగిందని తెలిపారు.. అందులో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 27 నుండి ఉచిత కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.. ఈ శిక్షణా శిబిరాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంబిస్తారని చెప్పారు. ఈ 27 ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు సిద్దిపేట బై పాస్ రోడ్డు జిల్లా గ్రంథాలయం ఎదురుగ ఉన్న బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో ఈ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఇటీవల అర్హత సాధించిన యువతి యువకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోగలరని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ నెంబర్‌ను 9030433459 కోరారు.

# విద్యా బస్సుయాత్ర బృందం బసకు డిఈఒ నో పర్మిషన్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** విద్యా బస్సు యాత్ర బృందం విశ్రాంతి కోసం రాత్రి బస చేసేందుకు ప్రభుత్వ పాఠశాలలో డిఈఒ, ఎంఈఒ అనుమతి నిరాకరించడంతో పాఠశాల గేటు ముందు భోజనాలు చేసి రాత్రి అక్కడే బస చేసిన వైనం చర్చనియాంశంగా మారింది. తెలంగాణలో ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలనే డిమాండ్‌తో రిటైర్డ్ ఐఏఎస్,రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరిమురళి,ప్రొఫెసర్ పద్మజశా, సృజనయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర గురువారం రాత్రి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌కు చెరింది. తిమ్మాపూర్‌లోనే బడినిద్ర చేపట్టాలనుకున్న వారికి ఉహించని పరిణామం ఏర్పడింది. బస్సు యాత్ర బృందం ఇక్కడే రాత్రి బడినిద్ర చేపట్టనున్నదన్న ముందస్తూ సమాచారం మేరకు జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు జగదేవ్‌పూర్ ఎంఈఒ సైదులు సూచన మేరకు పాఠశాల హెచ్‌ఎం పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేశారు. దీంతో బస్సు యాత్ర బృందం సభ్యులు ఆ పాఠశాల ముందే రాత్రి గ్రామస్థులతో సభ నిర్వహించి అక్కడే భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. బడి నిద్రకు అనుమతించకపోవడంపై అధికారుల తీరుపై ఆకునూరి మురళి ఆగ్రహాం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రవేటు పాఠశాలలో పీజుల నియంత్రణకు చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ జేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని సూచించారు. మాతృ భాషతో పాటు ఆంగ్ల భాషాపరిజ్ఞానం అవసరమని తెలిపారు. ప్రతి మండలానికి మూడు తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ బలోపేతం కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ ఎం.వి రెడ్డి, డా. జగదీష్,నిఖిల్ విజయకృష్ణా, డిబిఎఫ్ శంకర్, స్థానిక సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

# బొడ్మట్ పల్లి రోడ్డును విస్తరించాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మెదక్‌బొడ్మట్ పల్లి రహదారిని ప్రస్తుత ప్రతిపాదనలో కేవలం బలోపేతం చేయకుండా, పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఈ రహదారి హెచ్‌ఏఎం పథకం కింద బలోపేతానికి ప్రతిపాదించబడిందని, అయితే రహదారిపై ప్రయాణికుల వాహనాలతో పాటు వ్యవసాయ, వాణిజ్య, భారీ వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్‌బొడ్మట్ ట్‌పల్లి మధ్య అనుసంధానం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. హెచ్‌ఏఎం పథకంలోనే అదనపు పనులు చేపట్టేలా లేదా అవసరమైన అదనపు నిధులు సమకూర్చేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని కోరినట్లు వెల్లడించారు.

# పిఆర్‌సిని ప్రకటించాలి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పాపన్నపేట మండలంలో టిపిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకున్నారు. 317 బాధితులను వారి సొంత జిల్లాలకు పంపేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పిఆర్‌సి రిపోర్ట్ ను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ బిక్ష కాదు ఉద్యోగి హక్కు అని సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా వీరు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బాలరాజు, రమేశ్, అలాగే రాష్ట్ర కౌన్సిలర్లు హీరలాల్, నజీరోధీన్, జిల్లా నాయకులు ప్రవీణ్ గార్లు పాల్గొన్నారు.

# నాటు కోళ్ల ఫారంగా... మహిళ భవనం



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మహిళ సంఘాల సమావేశాల కోసం ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన భవనం నేడు నిర్వహణ కరువై నాటు కోళ్ల ఫారముగా మారింది. భవనంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా వృధాగా పడి ఉండటంతో గ్రామానికి చెందిన ఓ రైతు ఆ భవనంలో నాటు కోళ్లను పెంచుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెల్లితే జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో గతంలో మహిళ సంఘాల నిర్వహణ కోసం భవనం నిర్మించారు. కొంత కాలంగా ఆ భవనంలో గ్రామ మహిళ సంఘాల కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది. ఆయితే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మహిళ శక్తి సంఘాలకు మోడల్ భవనాలు నిర్మించటంతో మహిళ సంఘాల నిర్వహణ అంత కొత్త భవనాలలోనే కొనాసాగుతుంది.

# పొన్నాలలో కుక్క స్వైర విహారం



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ః** సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో కుక్క కాటుకు 13 మంది గాయపడగా నలుగురు ఆసుపత్రిలో ఆడ్మిట్ కాగా మిగతా వారిని ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. గ్రామ ప్రజలు,బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో గురువారం రాత్రి వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పాల్గొని విక్షిస్తుండాగా 7మంది కుక్క కాటుతో గాయపరుచగా,శుక్రవారం ఉదయం మరో 6 మంది కుక్క కాటుకు గుర్రైనారని తెలిపారు. కుక్క స్వైర విహారంతో ముక్క,చెవి,నడుము,చేతులు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ గాయపచింది. గాయపడిన 10 సంవత్సరాలలోపు ఆరాధ్య, అన్విత్, అక్షర, రోహిత్, కుమార్,సిరి పిల్లలుండగా,వెంకటయ్య,శ్రీనివాస్, దుర్గాప్రసాద్,కనకవ్వ,శంకర్ ఐదుమంది పెద్ద వారున్నారు. మనుషులపైనే కాకుండా ఒక లేఖ దూడను రెండు మేకలపై కూడా దాడి చేసి గాయపరిచిందన్నారు. గ్రామాలలో అనేక కుక్కలుంటున్నాయని వాటితో పెద్దవారు,మహిళలు,పిల్లలు బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అంబులెన్స్ లో ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి



ప్రజాపక్షం / నిజాంపేట్ : మెదక్ జిల్లా చేగుంట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గడ్డం రజిత కు పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది కీ సమాచారం ఇచ్చారు సమాచారం అందుకున్న నిజాంపేట్ 108సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని హాస్పిటల్ తరలిస్తుండగా పురటి నొప్పులు ఎక్కువ కావడం తో ఈ ఎం టీ స్వామి నార్మల్ డెలివరీ చెయ్యగా ఆడ బిడ్డకు జన్మ నివ్వడం జరిగింది. తల్లి బిడ్డ ను దుబ్బాక ప్రభుత్వం హాస్పిటల్ కి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా వున్నారని వైద్యులు తెలిపారు. ఈఎంటి స్వామి,పైలట్ సురేష్ ను అధికారులు అభినందించారు.

## జీవవైవిధ్య కమిటీ ఏర్పాటు



ప్రజాపక్షం / పెద్ద శంకరంపేట : పెద్ద శంకరంపేట మండలం దానంపల్లి గ్రామంలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీని ఏర్పాటు చేశారు. సర్పంచ్ కట్ట శంకర్ చైర్పర్సన్‌గా, పంచాయతీ కార్యదర్శి సిహెచ్. వెంకటరత్నం సభ్య కార్యదర్శిగా ఎంపిక య్యారు. సభ్యులుగా దానమొల్ల పెంటమ్మ, మంగలి లక్ష్మి, గడ్డి రాములు, మత్తమాల సాయిలు, పుట్ట రాములు నియమితుల య్యారు.గ్రామంలోని జీవవైవిధ్య పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, స్థానిక జీవజాతుల వివరాల నమోదు తదితర అంశాలపై కమిటీ పనిచేస్తుందని కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. గ్రామస్తుల సహకారంతో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

## రమ్యకు గవర్నర్ చేతుల మీదుగా లక్ష రూపాయలు

ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తుజాలపురం రమ్యకు అరుదైన గౌరవం దక్కింది. పదవ తరగతి ఫలితాల్లో 571 మార్కులు సాధించి జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించి, ప్రతిభ చాటుకున్నా రమ్యకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతులమీదుగా రమ్యకు 1 లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నియోజకవర్గం టాపర్‌గా నిలిచిన రమ్య ప్రతిభను, ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డిని, ఉపాధ్యాయ బృందాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందించారు. రమ్య విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంకీలకమని గవర్నర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని సాధించిన ఈ ఘనత ధూల్మిట్ట పాఠశాలతో పాటు సిద్దిపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

# మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా గణేష్ నిమజ్జనం



ప్రజాపక్షం / మెదక్ : మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్రజలకు శాంతి, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని వినాయకుడిని ప్రార్థించారు.
అనంతరం ఎమ్మెల్యే రోహిత్ రావు కోమటూర్ చెరువు వద్దకు చేరుకుని వినాయక నిమజ్జన కార్యక్రమాల కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు చేపట్టిన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.నిమజ్జన ప్రాంతంలో భక్తుల రాకపోకలు, జనసందోహం నియంత్రణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, నిమజ్జన ప్రాంతం వద్ద అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను ఎమ్మెల్యే పరిశీలించారు.
వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిమజ్జన ప్రాంతంలో పరిశుభ్రతను కాపాడాలని పేర్కొన్నారు.ప్రజలు, భక్తులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని ఎమ్మెల్యే రోహిత్ రావు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్, మంచినీటి, సరఫరాలపై మండల సర్వసభ్య సమావేశం



ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఎంపీడీవో భారతి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అయితే ముందుగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి వారి శాఖల ద్వారా గ్రామాలకు అందిస్తున్న సేవలను వివరించారు. నర్సాపూర్ మండలంలో నెలకొన్న విద్యుత్, మిషన్ భగీరథ తాగునీటి సమస్యలపై సర్పంచులు, అధికారులను నిలదీసి . సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నత్నాయపల్లి సర్పంచ్ ఉదయ్ కుమార్, ఎర్రకుంట తండా సర్పంచ్ సురేష్ నాయక్, తిరుమలాపూర్ సర్పంచ్ సాయిలు, ఎల్లారెడ్డి గౌడా తండా సర్పంచ్ బిక్కు నాయక్, గూడెంగడ్డ సర్పంచ్ నర్సింలు, రూప్ సింగ్ తండా సర్పంచ్ గేమ్ సింగ్, కాగజ్ మద్దూర్ సర్పంచ్ విజయ శివకుమార్ హాజరై మాట్లాడారు. అలాగే కొండాపూర్ నుంచి నత్నాయ పల్లి మీదుగా షేర్ ఖాన్ పల్లి వరకు, రెడ్డిపల్లి నుంచి ఇబ్రహీం బాద్, మీదుగా గోవిందరాజ్ పల్లి వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, తండాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ధూళిమిట్ట ప్రతిభకు జాతీయ బాట!



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : విద్య, పర్యాటకం, క్రీడా రంగాల్లో ప్రతిభను చాటుతూ, ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఒకవైపు పర్యాటక పోటీల్లో రాష్ట్రస్థాయికి.. మరోవైపు క్రీడల్లో రెండోసారి జాతీయ స్థాయికి.. ధూల్మిట్ట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాధిస్తున్న వరుస విజయాలు ధూల్మిట్ట పాఠశాల ప్రతిభకు అద్దం పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లాస్థాయి పోటీలలో ధూల్మిట్ట పాఠశాలకు మడో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లాలోని 78 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో స్థానిక చరిత్ర, వారసత్వం మరుగునపడిన పర్యాటక ప్రదేశాలను వెలుగులోకి తీసుకువస్తూ, ధూల్మిట్ట సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సుద్దాల రంజిత్ పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమాలు జిల్లాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని ధూల్మిట్ట మండల విద్యాశాఖ అధికారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు.

**"మట్టిలో మాణిక్యం రిత్విక్" కు రెండో సారి జాతీయస్థాయి అవకాశం...**

పట్టుదల, క్రమశిక్షణ ఉంటే గ్రామాణ పాంత్ర విద్యార్థులు కూడ అద్భుతాలు సృష్టించగలరని నిరూపిస్తున్నాడు ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శిరబోయిన రిత్విక్. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రుత్విక్ చదువుతో పాటుగా సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అసాధారణ ప్రతిభ కనబకుస్తూ, వరుస విజయాలతో జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన అండర్ 14 సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో రిత్విక్ అద్భుతమైన ప్రతిబ కనబరిచి బెస్ట్ ఆల్ రౌండర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కైవసం చేసుకున్నట్లు ధూల్మిట్ట పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెగ్గలం సతీష్‌కుమార్‌లు తెలిపారు.

## హుస్నాబాద్ బస్‌స్టాండ్ నాయకులకు ఏటిఎం గా మారిందా

ప్రజాపక్షం/ హుస్నాబాద్: సెప్టెంబర్ 25. హుస్నాబాద్ బస్‌స్టాండ్ నాయకులకు ఏ టి ఎంగా మారిందని బిఆర్ఎస్ ప్రభుత్వంలో 69 లక్షలు పెట్టి బస్‌స్టాండ్‌ను ఆధునికరించి మరో మారు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి రాగానే ఆధునికరణ పేరుతో మరో రెండు కోట్లా పైచిలుకు నిధులు పెట్టి మరమత్తు చేసిన రెండు ఏళ్లుకూడ నిలవ కుండ గురువారం కురిసి వానకు సీలింగ్ కుప్ప కూలి పోయింది. రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ప్రాయాణికులు ఎవ్వరు లేక పోవడం అదృష్టంగా మారిందని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. బస్‌స్టాండ్ ఆధునికణ విషయంలో రవాణశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నాణ్యత లోపం నేటి బస్‌స్టాండ్ సీలింగ్ కూలడంతో కంటాక్టర్లు మాత్రం వారి పర్సంటేజీలు వారు అప్పజెప్పి తూ తూ మంత్రంగా చేతులు దులుపుకుంటున్నారని ఆరోపనలు వెలుబడుతున్నాయి. ఈదే ఆధునికణ చేయకుండ పూర్తిగా తొలగించి సిద్దిపేట మాదిరగా ఎత్తులో నిర్మాణం చేపడితే నేడు ఈ పరిస్థితి రాదని ఆంటున్నారు. చిన్న వర్షం పడితే హుస్నాబాద్ బస్‌స్టాండ్ చూడ చక్కని నీటి కొలను తలపిస్తుందని ఆంటున్నారు. నాలుగు జిల్లాలకు సరిహద్దులో ఉన్న హుస్నాబాద్ బస్‌స్డాండ్ నుండి హన్మకొండ, సిద్దిపేట, జనగాం, కరీంనగర్‌కు నిత్యం కాలేజి పిల్లలు వ్యాపారస్తులు వివిధ పనులపై వ్యవసాయపనులపై వచ్చె వారు వేల సంఖ్యంలో వచ్చినప్పటికిని ఆధికారులు, ప్రజాప్రతినిధులు మంత్రులు పట్టించుకున్న పాపన పోలేదు. ఆధునికరించిన కొద్ది రోజులకే మరుగుదోడ్లు పనికి రాకుండ పోవడం ప్రాయాణప్రాంగణంలో వర్షం పడితే నీళ్లు బైటికి పోకుండ చెరువును తలపించడం పలుమార్లు మంత్రి పరిశీలించి నామమాత్రం ఏర్పట్లు చేయడం జరిగింది.

## ఎంపీ రఘునందన్ రావు రాజన్న టీ కొట్టును ప్రారంభించారు



ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలో సమీపంలో మెదక్ నర్సాపూర్ ప్రధాన రోడ్డు మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజన్న టీ కొట్టు ను శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, నాయకులు రమేష్ గౌడ్, నిర్వాకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఉద్యోగాల భర్తీ



ప్రజాపక్షం/మనోహరబాద్ : మెదక్ జిల్లా మనోహరబాద్ మండల్ కూచారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో (KGBV) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల నిర్వహణ అధికారులు,ప్రధానోపాధ్యాయురాలు గౌతమి తెలిపారు. పాఠశాలలో హెడ్ కుక్,నైట్ వాచ్ ఉమెన్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.హెడ్ కుక్ పోస్టుకు 10వ తరగతి అర్హతతో పాటు వంట చేయడంలో అనుభవం ఉండాలని,నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 9,750/ వేతనం అందించబడుతుందని తెలిపారు.

**అవసరమైన పత్రాలు :** ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు తమ ఆధార్ కార్డ్,10వ తరగతి బోనఫైడ్ సర్టిఫికేట్, బ్యాంక్ ఖాతా పాస్ బుక్ జిరాక్స్ ప్రతులతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను దరఖాస్తుకు జతచేయాల్సి ఉంటుంది.

**దరఖాస్తు గడువు:** అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26092026 నుండి 28092026 వరకు సాయంత్రం 4:00 గంటలలోపు కూచారంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నేరుగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

## క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో తప్పనిసరి భాగం కావాలి



ప్రజాపక్షం/ సిద్దిపేట : క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో తప్పనిసరి భాగం కావాలని సిద్దిపేట జిల్లా విద్యాధికాకరి రమేశ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ఉత్సాహభరితంగా నిర్వహించిన 70వ క్రీడా పోటీల్లో భాగంగా బాలికల కబడ్డీ పోటీలు నేటితో ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ మండలాలకు చెందిన క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాధికారి రమేష్ గారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో తప్పనిసరి భాగం కావాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులందరినీ జిల్లా విద్యాధికారి అభినందించారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారిణికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నర్రా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ పోటీలను విజయవంతం చేయడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సిద్దిపేట జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## గ్రామీణ వనరులు, సమస్యల పై విద్యార్థుల అధ్యయనం



ప్రజాపక్షం, కమలాపూర్: స్థానిక రైతు వేదికలో వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ (స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్) విద్యార్థులు చేపట్టిన గ్రామీణ వనరులు, సమస్యల అధ్యయన కార్యక్రమం రైతులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాంలో భాగంగా రైతుల భాగస్వామ్యంతో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్, సీజనల్ క్యాలెండర్, ప్రాబ్లెమ్ ట్రీ, మొబిలిటీ మ్యాప్, టైమ్‌లైన్ తదితర చిత్రపటాల ద్వారా వ్యవసాయ వనరులు, సాగులో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలను చక్కగా విశ్లేషించారు. ఈ కార్యక్రమం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి. భూపాల్ రాజ్, వివో వీలు ఏవో రహీం, కో ఆర్డినేటర్ టి. సాయికృష్ణ రెడ్డి, విలేజ్ కో ఆర్డినేటర్లు టి. సాయి కృష్ణ రెడ్డి, డాక్టర్ శరణబసవ్ హుడేద్ ల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది.

## యాసంగిలో ఎరువులు, సరఫరాలకు చర్యలు

ప్రజాపక్షం /జనగామ :ఎల్నినో ప్రభావం దృష్ట్యా జనగామ జిల్లాలో ముందస్తుగా యాసంగి రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలకు చర్యలు చేపడుతున్నట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు తెలిపారు. శుక్రవారం యాసంగి సీజన్ సన్నద్ధతపై వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయ సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాబోయే యాసంగి సీజన్‌ఓ ఎల్నినో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలు, సాంకేతిక సేవలు సకాలంలో అందించే కార్యాచరణ ప్రణాళికపై చర్చించడం జరిగిందన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, పప్పుధాన్యాల పంటల వైపు మొగ్గు చూపేలా క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన నాణ్యమైన విత్తనాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## దేశ భక్తికి ప్రతిరూపం భగత్‌సింగ్

ప్రజాపక్షం, తొర్రూరు : దేశ భక్తికి అసలు ప్రతిరూపం భగత్‌సింగ్ అని నేటి తరం యువత భగత్ సింగ్ ఆశయ సాధనకు పాటుపడాలని ఉపాధ్యాయ దర్శిని ఎడిటోరియల్ బోర్డు సభ్యులు సూరం ఉపేందర్ రెడ్డి, టీయూసీఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, ఏఐపికేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా సభలు, సమావేశాలు జరపాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం తొర్రూరులోని విశ్రాంతి భవనం ఆవరణలో పీవైఎల్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ధరావత్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు.

# చలో యాదగిరిగుట్ట పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/మంగపేట : మంగపేట మండలం కమలాపురం గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల స్థాయి సమావేశం మండల కన్వీనర్ గాదె శ్రీనివాసచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తెలంగాణ కోసం 14 సంవత్సరాలు సుదీర్ఘంగా పోరాటం చేసి, లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించుకున్నాం. కానీ తెచ్చిన తెలంగాణలో మమ్మల్ని పాలించిన, పాలిస్తున్న పార్టీలు ఏవీ పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం 25 వేల గౌరవ పెన్షన్ హెల్త్ కార్డు ఉచిత బస్సు పాస్ ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా ఆ హామీని నెరవేర్చలేదు. కేవలం కమిటీ వేసి కాలయాపన చేస్తోంది. ఇది ఉద్యమకారులను అవమానించడమే అని మండిపడ్డారు. హామీలను తక్షణమే అమలు చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

**చలో యాదగిరిగుట్టకు పిలుపు**

అనంతరం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ అధ్యక్షతన ఈనెల 27వ తేదీన యాదగిరిగుట్టలో జరగనున్న 9వ వార్షికోత్సవ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సభ మన ఆత్మగౌరవ సభ మండలంలోని ప్రతి ఉద్యమకారుడు తప్పనిసరిగా యాదగిరిగుట్టకు తరలిరావాలి. మన ఐక్యతను చాటుదాం అని గోవింద్ నాయక్ పిలుపునిచ్చారు.

# ఘనంగా ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ మండలం రెడ్లవాడ సొసైటీ చైర్మన్, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బక్కి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది లావుడ్య తిరుమల్ చౌహాన్, నెక్కొండ సహకార సంఘం చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి తదితరులు ఆవుల శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, నెక్కొండ సహకార సంఘం డైరెక్టర్ కేవి సుబ్బారెడ్డి, ఓబీసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నర్సంపేట న్యాయస్థాన ఏజీపి బండి శివ కుమార్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగం ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ రావుల తిరుపతి రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాపాక సర్వతోభద్ర ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు



ప్రజాపక్షం/చిట్యాల: జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల నైన్‌పాకకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు శుక్రవారం నాపాక సర్వతోభద్రత దేవాలయాన్ని సందర్శించారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఆలయం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై చైతన్యం కల్పించేందుకు ఈ సందర్శన ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. ఏకశిలపై నిర్మించిన ఈ ఆలయం క్రీస్తు శకం ఏడవ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారని విద్యార్థులకు వివరించారు. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం నాపాక లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు పెండ్యాల ప్రభాకరాచార్యులు విద్యార్థులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రణీత, పల్లవి, ప్రవీణ్, రఘు, ప్రసాద్, ఓదెలు, ఆలయ చైర్మన్ యాదండ్ల రాజయ్య, రాయరాకుల రాజయ్య, ఎర్రబెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విజేందర్ ఆశయాలను కొనసాగించాలి



ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మధుగాని విజేందర్ ఆశయాలను కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ నాయకుడు మధు గాని విజేందర్ ప్రథమ వర్ధంతి వేడుకలను ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ హాజరై విజేందర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజేందర్ అకాల మరణం పార్టీకి ఏఐటీయూసీ సంఘానికి తీరని లోటని, ఆయన మన మధ్యలో లేకున్నా ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. కార్మిక సమస్యలపై నిత్యం అనేక పోరాటాలు విజేందర్ నిర్వహించారని ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, నూకల చంద్రమౌళి, ఫిట్ సెక్రటరీలు కరిముల్లా, పి.శ్రీనివాస్, ఎల్ శంకర్, ఏరియా హాస్పిటల్ సతీష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, నేరెళ్ల జోసెఫ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## గణపతి లడ్డు దక్కించుకున్న శ్రీను

ప్రజపక్షం/మరిపెడ: విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని,గణేషుని దీవెనలతో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వాహించుకోవడం సంతోషంగా ఉందని మరిపెడ మున్సిపాలిటీ 3వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతగిరి శ్రీను అన్నారు.3వ వార్డు పరిధిలోని సీతారాంపురంలో వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెలకొల్పిన విగ్నేశ్వరుని నిమజ్జనం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన గణేశుని లడ్డు వేలం పాటలో ఉత్సాహంగా ఆయన పాల్గొని 35,216 రుపాయలకు పాట పాడి గణేశుని లడ్డు దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ విగ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికి సేవా చేస్తు వారితో కలిసి సంతోషంగా జీవించడమే తన కర్తవ్యం అని,నవరాత్రులు పూజలు అందుకోని పరమ పవిత్రంగా భావించే గణేశుని లడ్డు తనకు లభించడం సంతోషంగా ఉందని అన్నారు.

## వైద్య శిబిరాన్ని పర్యవేక్షించిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వయో వృద్ధుల వారోత్సవాల లో భాగంగా అన్ని వృద్ధాశ్రమ ములలో మెడికల్ క్యాంప్ లను నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా శుక్రవారం పెద్దమ్మగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని స్వయం కృషి మహిళా సొసైటీలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్ లు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, అవసరమైన మందుల పంపిణీ తదితర అంశాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన వైద్య సేవలను నిరంతరం అందించాలని సిబ్బందికి సూచించారు. వృద్ధుల్లో సాధారణ అనారోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించాలని తెలిపారు.

## మానవత్వం చాటుకున్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు



ప్రజాపక్షం/మంగపేట : మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన సోలిపురం లక్ష్మమ్మ (75)అనారోగ్య కారణంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజుపేట బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు యడ్లపల్లి నర్సింహారావు అధ్వర్యంలో శుక్రవారం సోలిపురం లక్ష్మమ్మ స్వగృహానికి వెళ్లి వారి కుమారుడు సోలిపురం కుమారస్వామిరెడ్డి ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనో ధైర్యం కల్పించి ఎల్లవేళలా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. కర్మల ఖర్చుల నిమిత్తం రాజుపేట బిఆర్ఎస్ పార్టీ నాయకులు అందరూ కలిసి ఇరువై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తీగలవేణీ విద్యార్థుల ఎంపిక

ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ తీగలవేణి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు ఈనెల 21న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన 12 వ తెలంగాణ జూనియర్ అథ్లెటాక్స్ ఛాంపియన్ షిప్ 2026 ఎంపికల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.అండర్ 16 విభాగం లాంగ్ జంప్‌లో 9వ తరగతి విద్యార్థిని ఎమ్ భార్గవి ప్రథమ స్థానం సాధించగా అండర్ 14 విభాగం కిడ్స్ జావెలిన్ త్రోలో 8వ తరగతి విద్యార్థిని ఎమ్ ప్రీతిక మొదటి స్థానంలో నిలిచారు.ఈప్రదర్శనతో వీరిద్దరూ ఈనెల 26 27 తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 12 వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు.

## సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

ప్రజాపక్షం, తొర్రూరు : ప్రతీ ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుగుణాకర్‌రాజు అన్నారు. తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరసాని సుధీర్‌రెడ్డి పదవీ విరమణ ఈ నెల 30న ఉండటంతో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పీహెచ్‌సీ, డిప్యూటీ, ఏరియా ఆసుపత్రి సిబ్బంది ముందస్తు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, స్థానికులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమేనని శేష జీవితం కుటుంబంతో గడిపేందుకు, సామాజిక సేవకు అంకితం చేయాలని కోరారు. సుధీర్‌రెడ్డి అంకిత భావం కలిగిన ఉద్యోగి అని, విధి నిర్వహణలో క్రమశిక్షణగా మెలిగే వారని తెలిపారు. అంకిత భావంతో పని చేసిన ఉద్యోగులను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారన్నారు.